క్లుప్తంగా

పేద విద్యార్థులకు వరం



ఫిరంగిపురం: జగనన్న ఆణిముత్యాలు పేద విద్యార్థులకు వరం అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలకేంద్రంలోని వసంతనగర్ జెడ్పీపాఠశాలలో శనివారం పదోతరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన నందగం పూజిత(552), టి.సాయికృష్ణ(485), ప్రభుకుమార్(479)లకు జగనన్న ఆణిముత్యాలు కింద ప్రథమ, ద్వితీయ, తృతీయ మెడల్స్, సర్టిఫికెట్లు, నగదును జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ అందజేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవిద్యార్థుల ఉన్నతి కోసం పలు పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. విద్యకు ప్రాధాన్యం ఇచ్చి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కె.చిన్నప్పరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ రంజన్‌బాబు, హెచ్‌ఎం సుకేష్‌మోజేస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం డ్వామా పీడీ యుగంధర్‌కుమార్ పరిశీలించారు. మర్రి బ్రహ్మయ్య పొలం నుంచి హౌస్‌గణేష్ వరకు నిర్వహిస్తున్న పొలిమేర పనులను పరిశీలించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూలీలకు తెలియజేశారు. హాజరు పట్టిక పరిశీలించి ప్రతికూలీ ఎన్‌ఎంఎంఎస్ ద్వారా తమ హాజరు వేయాలని తెలిపారు. ఆయన వెంట ఈసీ ప్రభాకర్, ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, కూలీలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థిని నాగలక్ష్మికి సత్కారం



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదివి 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాస్థాయిలో ద్వితీయస్థానం సాధించిన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు శనివారం సత్కరించారు. జగనన్న ఆణిముత్యాలలో భాగంగా ప్రభుత్వం ప్రతి పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి మూడు స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి నగదు పురస్కారాలను అందజేశారు. విద్యార్థిని ఎ.ఉదయనాగలక్ష్మి జిల్లాలో ద్వితీయస్థానం రావడంతో రూ.30 వేల నగదును కలెక్టర్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఉదయ నాగలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జోజప్ప, సుబ్బరాజు, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.శివకుమారి, బి.వి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రైఫిల్ షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థికి పతకాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో సీఎస్ఐటీ చదువుతున్న విద్యార్థి జాతీయ రైఫిల్ షూటింగ్‌లో నాలుగు పతకాలు సాధించినట్లు క్రీడా విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ కె.కిషోర్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 16 వరకు త్రివేండ్రంలో జరిగిన రైఫిల్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో మద్దినేని ఉమామహేష్ సీనియర్ విభాగంలో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించాడని తెలిపారు. యూత్ మిక్స్‌డ్‌లో బంగారు పతకంతోపాటు రెండు రజత పతకాలు సాధించి జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను నాల్గవ స్థానంలో నిలిపి రికార్డు సృష్టించాడని వివరించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు మద్దినేని ఉమామహేష్‌ను అభినందించారు.

లీకైన గ్యాస్ సిలిండర్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి అమరావతి రోడ్డులో ఓ హోటల్‌లో గ్యాస్ సిలెండర్ లీకై మంటలు చెలరేగిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లి అమరావతి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానం వద్ద రావుల మస్తాన్ హోటల్ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం గ్యాస్ పొయ్యి మీద వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందరూ భయంతో బయటకు పరుగులు తీశారు. ఆ సమయంలో అటుగా వస్తున్న ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అంజాద్ గ్యాస్ బండను బయటకు తీసుకు వచ్చి మంటలను అదుపు చేశాడు.

కొనసాగుతున్న ఇళ్లపట్టాల పంపిణీ

6వ సచివాలయంలో 42 మంది లబ్ధిదారులకు అందజేత

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని 6వ సచివాలయాలంలో శనివారం 42 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి విచ్చేసిన ఎస్టీ సెల్ తాడేపల్లి పట్టణ కన్వీనర్ ముదిగొండ ప్రకాష్, మాజీ కౌన్సిల్ లక్ష్మీరోజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే ఆర్కే చొరవతో తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాలలోని పేదలందరికీ ఇళ్లపట్టాలు పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ దేవనిహార్, శానిటేషన్ సెక్రటరి గౌసియా, వెల్ఫేర్ సెక్రటరీ సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అంబారావు, ఉదయరాజు, ఉప్పు శ్రీను, కొండ, వలంటీర్లు పాల్గొన్నారు.



తాడేపల్లి 6వ సచివాలయంలో ఇళ్లపట్టాలను అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ లక్ష్మీ రోజ, వైఎస్సార్‌సీపీ నాయకులు

సొంతింటి కల నెరవేరింది

జగనన్న పుణ్యమా అంటూ మాకు సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న కోరిక తీరింది. తాడేపల్లిలో సెంటు స్థలం రూ.15–20 లక్షల ధర పలుకుతోంది. సీఆర్‌డీఏ పరిధిలో జగనన్న మాకు స్థలం కేటాయించడంతో మా పేరు మీద రూ.10 లక్షల ఆస్తి లభించింది. త్వరలోనే అక్కడ నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటాం.



– పల్లెపోగు శ్రీదేవి

మనసు కుదుటగా ఉంది

రైల్వే స్థలాల్లో 40–50 సంవత్సరాల కిందట ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నాం. సంవత్సరానికి ఒకసారి రైల్వే అధికారులు ఇళ్లు పీకేస్తామని బెదిరిస్తూ ఉంటారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందేవారం. ఎమ్మెల్యే ఆర్కే రైల్వే స్థలాల్లో నివసించే వారికి ఇళ్లస్థలాలు కేటాయిస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే ఆర్కే మాకు సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల స్థలం కేటాయించడంతో మా మనసు కుదుట పడింది.



–యాదల శివపార్వతి

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

మంగళగిరి: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. శనివారం రత్నాలచెరువు, యర్రబాలెం బసవతారకనగర్, నవులూరు ఎన్టీఆర్ కాలనీలలో జరుగుతున్న గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులతోపాటు ఆత్మకూరు గుంటూరు ఛానల్ వద్ద తాగునీటి పథకం ఆవరణలో జరుగుతున్న పంప్ హౌస్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ పనులు, పెదకోనేరు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్ పనులను వెంటనే పూర్తిచేసి వారం రోజులలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నగరంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలలో నాణ్యతలో రాజీపడకుండా వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలన్నారు. పెద కోనేరు పనులు మరింత వేగవంతం చేసి వర్షాకాలం రాకముందే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆక్రమణలు తొలగించి రహదారుల నిర్మాణం చేపట్టాలి

మంగళగిరి: నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో రహదారులను సైతం విస్తరించి ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. శనివారం ఆయన యర్రబాలెం బసవతారక నగర్‌లో పర్యటించారు. రూ.45లక్షలతో ఇప్పటికే పూర్తి చేసిన సీసీ రహదారి నిర్మాణంతోపాటు మరో రూ.60 లక్షలతో ఈద్గా వద్ద నుంచి ఆర్‌అండ్‌బీ రహదారి వరకు చేపట్టిన మరో సీసీ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే పొగాకు కంపెనీ వద్ద నుంచి బసవతారకనగర్ మీదుగా చెరువు కట్ట వరకు సుమారు రూ.2 కోట్లతో బీటీ రహదారిని నిర్మాణ పనులు కూడా ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నవులూరు ఎన్టీఆర్ కాలనీలో రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

పేదలకు వరం వైఎస్సార్ కంటివెలుగు

ఫిరంగిపురం: డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం పేదల పాలిట వరమని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని సచివాలయం-1 వద్ద శనివారం ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి బుధ, గురు, శనివారాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. కంటివెలుగులో ఎందరు పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి శుక్లాలు తీయించుకునేందుకు ఎక్కడకు రిఫర్ చేశారనే వివరాలు పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 50 మందికి నేత్ర పరీక్షలు చేశామని, 25మందికి కళ్ల జోళ్లు అందించేందుకు పేర్లు నమోదుచేసినట్లు నేత్ర వైద్యనిపుణురాలు రోజారాణి తెలిపారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ కోసం స్థలం గురించిన వివరాలు గ్రామసర్పంచి, తహసీల్దార్‌ను కలిసి వివరాలు సేకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట చైతన్య, టి.లూర్దురాజు, ఆరోగ్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



నేత్రపరీక్షలు పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్‌బాబు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు కాలిపోయిన సంఘటనలో పోపూరి యువరాజుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ మొత్తాన్ని బాధితుడికి ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, నాయకులు షేక్ జానీ బాషా, నూతలపాటి భాస్కర్, కర్రే సుధాకర్, పోపూరి హృదయరాజు, బుస్సా బుల్లిబాబు, మేడికొండ అజయ్ తదితరులు పాల్గొన్నారు. చిలువూరు గ్రామానికి చెందిన చిలువూరు భరత్‌కుమార్‌కు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వడ్డేశ్వరపు రజనీకాంత్, నాయకులు చిలువూరు ఫిలోమిన, జానీబాషా, హాసిన్ రవి తదితరులు పాల్గొన్నారు.

రిక్షాబండ్లు పంపిణీ

తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట ప్రాంతానికి చెందిన సానికొమ్ము కాశీరెడ్డి, ముగ్గురోడ్డుకి చెందిన పోలంపల్లి రాజు (పుట్టుకతో మూగ), సీతానగరానికి చెందిన కె.సాంబయ్యలకు ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు శనివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకట రామిరెడ్డి, జిల్లా యస్‌టి సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు, జిల్లా యస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ యస్‌సి, యూత్, మైనార్టీ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, తుమ్మపూడి మహేష్‌రెడ్డి, సయ్యద్ రసూల్, తేజ, జగదీష్, అనిల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



యువరాజు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- చొరవ చూపించిన ఎమ్మెల్యే ఆర్కే
- రాజ్యసభ సభ్యుల నిధుల నుంచి రూ.45 లక్షలు విడుదల
- పాత బ్రిడ్జి తొలగింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చిలువూరులో బకింగ్‌హామ్ కెనాల్‌పై ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా పాత బ్రిడ్జి కూల్చివేత పనులను శనివారం చేపట్టారు. కెనాల్ దాటేందుకు గతంలో నిర్మించిన ఫుట్‌బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు నిధుల నుంచి రూ.45 లక్షలు కేటాయించడంతో వెంటనే పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్కే చొరవ చూపించడం పట్ల చిలువూరు గ్రామస్తులు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరుకు చెందిన బాలుడు రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం కంఠంరాజు కొండూరుకు చెందిన దాసరి దివ్య, రాజులకు తరుణ్ (11) కుమారుడు. పంట పొలంలో కలుపు తీసేందుకు కంఠంరాజు కొండూరు నుంచి రాజు తన సొంత ఆటోలో కూలీలతోపాటు భార్య దివ్య, కొడుకు తరుణ్‌ను ఎక్కించుకుని వెళుతున్నారు. కంఠంరాజు కొండూరు వద్దకు రాగానే తరుణ్ ఆటో స్టీరింగ్‌ను పక్కకు తిప్పి బ్రేక్ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ముందు కూర్చున్న తల్లి, కూలీలు పక్కకు పడిపోగా తరుణ్ ఆటో కింద పడ్డాడు. రాజు వెంటనే కిందకు దిగి ఆటోను లేపి తీవ్రంగా గాయపడ్డ కొడుకును ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామస్తులు తరుణ్ మృతదేహాన్ని ఇంటికి తరలించారు. దుగ్గిరాల పోలీసులు విచారణ చేపట్టారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

ఒక జేసీబీ, ఏడు ట్రాక్టర్లు, ఏడు టిప్పర్లు స్టేషన్‌కు తరలింపు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామ చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్నా సమాచారంతో జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు, మైనింగ్, రెవెన్యూ సిబ్బందితో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ డీజీ ఉత్తర్వుల మేరకు పంచాయతీకి చెందిన చెరువులో అక్రమంగా తరలిస్తున్న ఒక జేసీబీ, ఏడు ట్రాక్టర్లు, ఏడు టిప్పర్లను గుర్తించి వాటిని సీజ్‌చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మైనింగ్ అధికారులకు తగిన జరిమానా విధించాలని ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులకు తెలియజేశామని చెప్పారు. ఎంత మట్టిని తరలించారనే దానిపై త్వరలో విచారణ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మైనింగ్ ఏజీ ఎస్.ప్రసాద్, మెయిన్ డిపార్ట్‌మెంట్ టీఏ భవాని, ఆర్ఐ కోటేశ్వరరావు, విజిలెన్సు సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు

మానవ మెదడు పనితీరుపై పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్: మానవ మెదడు సంక్లిష్టమైన అవయవమని, మెదడును అర్థం చేసుకోవడం అంటే సొంత ఆరోగ్యాన్ని అర్థం చేసుకోవడమేనని కేఎల్ విశ్వవిద్యాలయం చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. శనివారం విశ్వవిద్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రొ చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాధరావు మాట్లాడుతూ వైద్య రంగంలో మానసిక ఆరోగ్యం పెను సవాల్‌గా మారిందని అన్నారు. ఆగష్టు 21 నుంచి 25 వరకు జరిగే ఐదు రోజుల కార్యశాలకు వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వసుజాదేవి కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా ఎస్.ఇ.ఆర్.బి. సైన్స్, టెక్నాలజీ విభాగం వారి సహకారం అందించనున్నారని వివరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ సలహాదారు డాక్టర్ ఎ.ముఖోపాధ్యాయతో కలసి పోస్టర్ ఆవిష్కరించి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో యువ పరిశోధకురాలు సౌమ్య, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎ.ముఖోపాధ్యాయ, యూనివర్సిటీ ప్రొ చాన్సలర్ డాక్టర్ జగన్నాధరావు

విద్యార్థి అనుమానాస్పద మృతి

- తల్లి, మారు తండ్రి చంపారంటున్న బంధువులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఓ విద్యార్థి అనుమానాదాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై శనివారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడు ఉరి వేసుకోలేదని, తల్లి, మారు తండ్రే చంపి ఉరి వేశారంటూ బాలుడు సాగర్‌దాస్ చరణ్ (12) మేనమామ పిల్లి సుధీర్ ఆరోపిస్తున్నాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లి సాగర్ సౌజన్య, కనకయ్యలకు 14 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు(సాగర్‌దాస్ చరణ్). రోడ్డు ప్రమాదంలో కనకయ్య మృతి చెందాడు. అప్పటి నుంచి సాగర్‌దాస్ అమ్మమ్మ తాతయ్యల దగ్గర ఉంటున్నాడు. సాగర్ సౌజన్య విజయవాడలో హోంగార్డుగా పనిచేస్తూ కొలనుకొండలో నివాసముండే జోషి నాగేశ్వరరావును రెండో వివాహం చేసుకుంది. వివాహం అనంతరం కొలనుకొండలో నివాసముంటున్నారు. ఏడో తరగతి పూర్తిచేసిన చరణ్ చుండూరులోని హాస్టల్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోగా సీటు లభించింది. స్టడీ సర్టిఫికెట్ అవసరమై మూడు రోజుల కిందట తల్లి సాగర్ సౌజన్య వద్దకు వచ్చాడు. సౌజన్య, నాగేశ్వరరావులు బయటకు వెళ్లిన సమయంలో బాలుడు తల్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి ఫిర్యాదు చేయగా, బాలుడి మేనమామ పిల్లి సుధీర్ మాత్రం తల్లి, రెండో భర్త చంపి ఉరివేశారని ఆరోపిస్తున్నాడు. ఈ సంఘటనపై అనుమానాదాస్పద కేసుగా నమోదు చేశామని, పోస్ట్‌మార్టం అనంతరం వాస్తవాలు నిర్ధారిస్తామని ఎస్ఐ తెలిపారు.




మృతి చెందిన బాలుడు సాగర్‌దాస్ చరణ్

అర్హులందరికీ పథకాలు చేరాలనే జగనన్న సురక్ష

- క్లస్టర్‌లోని ప్రతి ఇంటికి వలంటీర్లు వెళ్లాలి
- సాంకేతిక కారణాలతో నిలిచిన పథకాలు అందేలా చర్యలు
- నగర కమిషనర్ యు శారదాదేవి


మంగళగిరి: అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష ఉపయోగపడాలని నగర కమిషనర్ యు.శారదాదేవి తెలిపారు. నగరంలో ఆటోనగర్‌లో కల కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో జగనన్న సురక్షపై అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వలంటీర్ తన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకుని ఏదైనా సాంకేతిక కారణాలతో నిలిచివుంటే పరిష్కరించి పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. అర్హులైనా 6 స్టెప్ సర్వేలో విద్యుత్ బిల్లులు, అధికంగా వచ్చాయని, ఫోర్ వీలర్ ఉన్నదని, ఇంటి పన్ను వారి పేరిట ఉందని ఇలా అనేక కారణాలతో పథకాలు నిలిచిన వారిని గుర్తించి సాంకేతిక ఇబ్బందులు తొలగించి ఆన్‌లైన్ చేసి మరలా పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వలంటీర్లు సర్వే నిర్వహించాలని వారిపై సచివాలయ సిబ్బంది, ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఏ ఒక్క అర్హుడు ప్రభుత్వ పథకానికి దూరం కాకూడదనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష అమలు చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా సర్వే నిర్వహించి అందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జగనన్న సురక్ష ప్రత్యేకాధికారి డీఎఫ్‌వో కె.మహబూబ్ బాషా, తహసీల్దార్ జీవి రామ్‌ప్రసాద్, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ యు శారదాదేవి

ఫిరంగిపురం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయాల సిబ్బందికి జగనన్న సురక్ష పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడం, అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యంగా ఈనెల 23నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సచివాలయ సిబ్బంది చేసే పనిని గ్రామ, వార్డు సచివాలయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్, షహేలానర్గీస్, వైస్ ఎంపీపీ జి.చంద్రం, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీవో దాసరి అనూరాధ పాల్గొన్నారు.

మేడికొండూరు: ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్షా పథకాన్ని అమలు చేయడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని మండల ప్రత్యేక అధికారి వీరాచారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న సురక్షా పథకంపై మండల స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, తహసీల్దారు కరుణకుమార్, ఈఓపీఆర్డీ రవికుమార్, పలు గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, సోషల్ వెల్ఫేర్ అధికారులు, పంచాయతీఇంజినీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎ.దీప్తి, వేదికపై నియోజకవర్గ ప్రత్యేకాధికారి పరిశ్రమల శాఖ జేడీ సుధాకర్ తదితరులు

తాడికొండ: జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమం చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అధికారులు, సిబ్బందిని ఇంటింటికి పంపిస్తుందని తాడికొండ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ జేడీ సుధాకర్ అన్నారు. శనివారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకం అందని లబ్ధిదారులు ఒక్కరూ కూడా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన చర్యలలో భాగంగా ప్రత్యేక శిక్షణ అందజేయడం జరిగిందన్నారు. మండలస్థాయి సిబ్బందికి శిక్షణ అందించడంతోపాటు వలంటీర్లకు కూడా 20, 21, 22 తేదీల్లో శిక్షణ అందిస్తామన్నారు. ఎంపీడీవో ఆత్తోట దీప్తి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఇళ్లను సందర్శించినపుడు మాకు సంక్షేమ పథకం అందడం లేదనే లబ్ధిదారుడు కనిపించకూడదనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 23వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి తక్షణమే సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు. తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పాల్గొన్నారు.